నెర్రెలిస్తున్న వరిచేలు

- సాగునీటి కోసం అన్నదాతల ఎదురుచూపులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- పొలాలు నెర్రెలిచ్చి, ఎండుతున్న వరి పైరు



యండకుదురు గ్రామంలో సాగునీరు లేక నెర్రెలిచ్చిన వరి పొలాలు

యండకుదురు(ఘంటసాల): రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామంటూ గొప్పల డప్పాలు కొడుతున్న ప్రజాప్రతినిధులు సాగునీరు అందక వరి పొలాలు ఎండిపోతున్నా పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో తమ పరిస్థితులను పట్టించుకునే నాథుడే లేడని యండకుదురు గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎండిపోయే పరిస్థితి..

ఘంటసాల మండలం యండకుదురు గ్రామంలో మధ్య (మైబోదు) బోదు కింద సుమారు 80 ఎకరాలకు పైగా పంటపొలాలు ఉన్నాయి. ఈ పొలాల్లో వరి సాగవుతోంది. భీమనది చానల్ నుంచి పూషడం బ్రాంచి కాలువ ద్వారా మై బోదుకు సాగు నీరు అందుతుంది. ప్రస్తుతం సాగు నీరు అందక సుమారు 40 ఎకరాల్లో వరి పొలాలు నెర్రలిచ్చాయి. పైరు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. పంట పొలాల పరిస్థితిని మైల్ జవాను, ఇరిగేషన్ అధికారులకు ఫోన్ ద్వారా తెలిపినా స్పందన లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

మేమేం చేయలేం..

'వస్తున్న నీటినే ఇస్తున్నాం.. మమ్మల్ని ఏమి చేయమంటారు?' అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారే గానీ సమస్యను ఆలకించడంలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కొద్దోగొప్పో నీరు వస్తుంటే పూషడం గ్రామం పరిధిలోని రైతులు అడ్డుకట్టలు వేసి వారి పొలాలకు పెట్టుకుంటున్నారని, దీంతో దిగువకు సాగునీరు అందక పొలాలు ఎండుముఖం పట్టాయని యండకుదురు రైతులు పేర్కొంటున్నారు.

ఆయిల్ ఇంజిన్లతో నెట్టుకొచ్చాం..

ఇప్పటి వరకు ఆయిల్ ఇంజిన్లతో పొలాలకు నీటి తడులు అందించామని, ఇక ఖర్చుచేసే పరిస్థితి లేదని వాపోతున్నారు. కాలువపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో కాలువ చివరి భూములకు సాగునీరు అందడంలేదని వివరిస్తున్నారు.

ఆర్థికంగా ఇబ్బంది..

ఇప్పటి వరకు అప్పు చేసి సాగుచేశామని, పంట ఎండిపోయి చేతికొచ్చే పరిస్థితి లేకపోతే ఆర్థికంగా కుంగిపోతామని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యండకుదురు గ్రామంలోని మైబోదుకు సాగునీరు సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకుని తమ సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.



గుండె తరుక్కుపోతోంది

మేము వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. సొంతం, కౌలు కలిపి 25 ఎకరాలు సాగు చేస్తున్నాను. అష్టకష్టాలుపడి నాట్లు వేసి పంటను ఇప్పటి వరకు కాపాడుకుంటూ వచ్చాను. ఇప్పుడు సాగునీరు లేక కళ్లెదుటే పొలాలు నెర్రెలిచ్చి పైరుఎండిపోతుంటే గుండె తరుక్కుపోతోంది. అధికారులను, ప్రజా ప్రతినిధులను అడిగినా స్పందించరు. ఇప్పటి వరకు ఇంజిన్ ఆయిల్‌కు సుమారు రూ.30 వేలకు పైగా ఖర్చు చేశా. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సాగునీరు అందించాలి.

– పెద్ది కిషోర్, రైతు, యండకుదురు



ఆయిల్ ఇంజిన్ ఖర్చు రూ.35 వేలు

సొంతం, కౌలు కలిపి 10 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. వృద్ధాప్యం వచ్చినా వ్యవసాయం మీద మక్కువతో అప్పోసొప్పో చేసి నాట్లు వేసి ఇప్పటి వరకు పొలాన్ని కాపాడుకున్నా. సాగునీటి కోసం మేము పడుతున్న ఇబ్బందులు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇరిగేషన్ అధికారులు కాలువల పర్యవేక్షణ లేక జమాను ఇష్టాను రీతిగా వ్యవహరిస్తూ దిగువకు సాగునీరు రాకుండా చేస్తున్నారు. ఇప్పటి వరకు కేవలం ఇంజిన్ ఆయిల్‌కు రూ.35 వేలు ఖర్చు చేశా. ఇక ఓపిక లేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సాగునీరందించాలి.

– మిద్దే ధర్మారావు, రైతు, యండకుదురు

క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇంటిపై దాడి దుర్మార్గం

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్



అవనిగడ్డ: సీఎం చంద్రబాబు తిరుపతి లడ్డూ ప్రసాదంపై చేసిన విమర్శలను సాకుగా చూపి బీజేవైఎం ముసుగులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటిపై దాడికి పాల్పడం దుర్మార్గమైన చర్యని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలుకుర్తి రమేష్ తీవ్రంగా ఖండించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యలయం వద్ద ఆదివారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి దేవుని పేరుతో భావోద్వేగాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. ఈ దాడికి సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడిన చంద్రబాబు సమాజంలో అలజడులకు తెరతీశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం స్పందించి లడ్డూ ప్రసాదంపై చేస్తున్న విమర్శలకు కారకులను శిక్షించాలని, లేదంటే తన తప్పుని ఒప్పుకుని చంద్రబాబు ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని రమేష్ డిమాండ్ చేశారు. ఎస్సీసెల్ నాయకులు గుంటూరు శ్రీనివాసరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నాం

పెడన: పట్టణంలో మార్కెట్ యార్డు ఆవరణలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. మాటలకే పరిమితం కాకుండా ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చేదిశగా అడుగులు వేస్తూ ప్రజా సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, జనసేన నియోజకవర్గం సమన్వయకర్త పంచకర్ల సురేష్, మాజీ వైస్ చైర్మన్‌లు పూలబాబు, హన్ను, యక్కల శ్యామలయ్య, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

తీర గ్రామాల్లో సీఐ పర్యటన

ఏటిమొగ(నాగాయలంక): దివిసీమలోని పాలకాయతిప్ప కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ సీఐ రావి సురేష్‌రెడ్డి ఆదివారం మండలంలోని తీరగ్రామాల్లో పర్యటించారు. సీఐగా శనివారం స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఆయన ఇక్కడ తీర ప్రాంత గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తీరగ్రామాల మత్స్యకారులతో ఏటిమొగ పంటు ప్లాట్‌ఫారం వద్ద మాట్లాడారు. తీరప్రాంతంలో కొత్త వ్యక్తులు, కొత్త బోట్లు తారసపడితే తక్షణం కోస్టల్ సెక్యూరిటీ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. తీరంలో అవాంఛనీయ పరిస్థితులు, వ్యక్తులను గుర్తిస్తే వెంటనే మొబైల్ నంబరు 93929 14730, టోల్‌ఫ్రీ నంబర్ 1093కి సమాచారం ఇచ్చి రక్షణ పొందాలని సీఐ సూచించారు.

27న రక్తదాన శిబిరం

మోపిదేవి: స్వచ్ఛంద రక్తదాన శిబిరం వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ టి.ఎస్.ఎస్ బాలాజీ ఆదివారం ఆవిష్కరించారు. మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు వర్ధంతి సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మోపిదేవి సబ్ బ్రాంచ్, గ్రామీణ యువజన వికాస సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 27న ఈ శిబిరం నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు మోపిదేవిలో శిబిరం ప్రారంభమవుతుందని మోపిదేవి సబ్ బ్రాంచ్ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ రిమ్మనపూడి సుబ్రహ్మణ్యం, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

ఘంటసాల: యువత సన్మార్గంలో పయనించి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చుదిద్దుకోవాలని ఎస్ఐ కె.ప్రతాప్ రెడ్డి అన్నారు. మండలంలోని కొడాలి గ్రామానికి చెందిన జీఎన్నార్ యూత్ ఆధ్వర్యంలో ఎస్ఐ ప్రతాప్‌రెడ్డిని ఆదివారం సత్కరించారు. ఇటీవల జరిగిన వినాయక చవితి సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా బందోబస్తు పర్యవేక్షించడంతో పాటు వినాయకుని నిమజ్జనం ఊరేగింపులో ప్రజలకు ఇబ్బందుల్లేకుండా విజయవంతం కావడానికి సహకరించిన పోలీసు సిబ్బందికి జీఎన్నార్ యూత్ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జీఎన్నార్ యూత్ సభ్యులు గుంటూరు కార్తీక్, కనగాల శివాజీ, సిద్దెల పవన్, చంద్ర శశికాంత్, దేవరపల్లి శ్రీనివాస్ ఉన్నారు.

16 మద్యం బాటిళ్లు స్వాధీనం

నాగాయలంక: మండలంలోని కమ్మనమోలు గ్రామానికి చెందిన ప్రసాద్ ఇంటిలో 16 క్వార్టర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్.ఐ కలిదిండి రాజేష్ ఆదివారం చెప్పారు. నాగాయలంక నుంచి అక్రమంగా మద్యం బాటిళ్లు తీసుకెళ్లి అతని ఇంటి వద్ద అధిక ధరలకు అమ్ముతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. సిబ్బందితో కలిసి దాడి చేసి లైసెన్స్ లేకుండా మద్యం బాటిళ్లు కలిగి ఉన్నందున వాటిని స్వాధీనం చేసుకుని ప్రసాద్‌ను పట్టుకున్నామని చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసామని ఎస్ఐ వివరించారు.

రఘురామకృష్ణంరాజును సస్పెండ్ చేయాలి

- అంబేడ్కర్ బ్యానర్ చించివేతపై దళిత సంఘాల నిరసన
- ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుకు డిమాండ్



బంటుమిల్లి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జై భీం దళిత సంఘ నాయకులు



సీతనపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న స్థానికులు

బంటుమిల్లి: ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ జైభీం దళిత సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బ్యానర్లు చించి ఆయనను అవమానించారని సంఘ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుల పట్ల ఆయనకు ఉన్న చిన్నచూపు, అహంకారానికి ఈ సంఘటన అద్దం పడుతోందని వారు విమర్శించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ సెంటర్లో రాజ్యాంగ నిర్మాత విగ్రహం వద్ద నిరసన తెలిపారు. రఘురామకృష్ణంరాజు చిత్రపటాన్ని తగులపెట్టారు. రాజ్యాంగ నిర్మాతను అవమానించిన ఎమ్మెల్యేను పార్టీ నుంచి సస్పెండ్‌చేసి ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన సంఘ నాయకులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్‌పై ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు శనివారం ఏలూరుపాడులో చేసిన చేష్టలు దారుణమైనవని పలువురు దళితులు నిరసన వ్యక్తం చేశారు. కృత్తివెన్ను మండలం సీతనపల్లి దళితవాడలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహం ఎదుట తమ నిరసన తెలిపారు.

కూటమి నేతల హంగామా

నాగాయలంక: మండల నోడల్ అధికారి రామ్‌లక్ష్మణ్ నేతృత్వంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆదివారం సాయంత్రం ప్రజావేదిక- ప్రజాదర్బార్ పేరుతో ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. అధికారుల పాత్ర నామ మాత్రం కాగా కూటమి నేతలు రావడంతో సభలో హంగామా ఫుల్‌గా కనిపించింది. నోడల్ అధికారి తూతూ మంత్రంగా మాట్లాడి సభను పార్టీ నాయకులకు అప్పగించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఢిల్లీ వెళ్లడంతో ఆయన స్థానంలో కుమారుడు మండలి వెంకట్రామ్ హాజరయ్యారు. పార్టీల వర్గాలతో సభా ప్రాంగణం రసాభాసాగా మారింది. అధికారులు, ఉద్యోగులు నిమిత్తమాత్రులయ్యారు. స్థానిక పంచాయతీ పరిధిలోని 11వ వార్డులో కొందరు బడా వ్యక్తులు లాండ్ కన్వర్షన్ చేయకుండా, పంచాయతీ అనుమతులు లేకుండా అక్రమ లేఅవుట్‌లతో ఇంటిస్థలాలు అమ్ముతున్నారని మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు తలశిల బుల్లియ్యచౌదరి నోడల్ అధికారికి వినతిపత్రం అందజేయడం చర్చనీయాంశమైంది.

బ్లేడ్‌తో దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

పెడన: మండల పరిధిలోని ఉప్పలకలువగుంటలో ఈ నెల 20న రాత్రి గుడిశేవ నాగబాబు (45)పై ముచ్చర్ల గ్రామానికి చెందిన యర్రంశెట్టి కొండబాబు (23) బ్లేడ్‌తో దాడి చేసి గాయపరిచాడు. ఈ విషయమై నాగబాబు ఫిర్యాదు మేరకు పెడన ఇన్‌చార్జి ఎస్ఐ ఎ.గణేష్‌కుమార్ కేసు నమోదు చేశారు. నాగబాబు అప్పుగా రూ.30 వేలను కొండబాబుకు ఇచ్చాడు. ఈ నగదు తిరిగి ఇవ్వాలని కోరిన నాగబాబుపై కొండబాబు బ్లేడ్‌తో విక్షణరహితంగా దాడి చేశాడు. నాగబాబు మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్ఐ గణేష్ కుమార్ కొండబాబును అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపచగా రిమాండ్ విధించారని తెలిపారు.

ఇన్‌చార్జి ఎస్ఐగా గణేష్‌కుమార్..

పెడన ఎస్ఐ జీ.సత్యనారాయణకు రోడ్డు ప్రమాదం జరిగి విశ్రాంతి కోసం సెలవు పెట్టారు. దీంతో బంటుమిల్లి ఎస్ఐ ఎ.గణేష్‌కుమార్‌ను ఇన్‌చార్జిగా నియమించారు.

రాత్రి గస్తీ ముమ్మరం చేశాం

కాసానగర్(మోపిదేవి): జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్ రావు ఆదేశాలతో రాత్రి వేళ పకడ్బందీగా రాత్రి గస్తీ ముమ్మరం చేశామని ఎస్ఐ.సత్యనారాయణ ఆదివారం తెలిపారు. నైట్ రౌండ్స్ ఆఫీసర్స్ నిరంతరం బీట్ పాయింట్స్ తనిఖీలు చేసి, ప్రార్థనా మందిరాలు, ఏటీఎంలు, వ్యాపార సముదాయాల వద్ద సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. నేరాలు జరగకుండా గస్తీ విధులు నిర్వహించాలని చెప్పారు. అనుమానిత వాహనాల తనిఖీల నిర్వహణ, వాహన రికార్డ్స్ పరిశీలన, ప్రయాణికులను తనిఖీ చేసి, అనుమానిత వ్యక్తుల వివరాలు, వారి వేలిముద్రలు సేకరించి దొంగతనాలు జరగకుండా, శాంతిభద్రతల పరిరక్షణ, అక్రమ రవాణా నివారణకు చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ వివరించారు.

టౌన్ సర్వేయర్‌గా నాగరాజు

పెడన: స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో టౌన్ సర్వేయర్‌గా సీహెచ్ నాగరాజును నియమిస్తూ మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయం నుంచి ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం ఈయన ఎన్టీఆర్ జిల్లాలోని డీఎస్ఎల్‌వో కార్యాలయంలో టీఎఫ్‌డీఎస్ (టాస్క్ ఫోర్సు డెప్యూటీ సర్వేయర్)గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పెడన టీఎస్ పోస్టు ఖాళీగా ఉండటంతో నాగరాజును పెడన టీఎస్‌గా నియమించారు.

ఇసుక లోడు ట్రాక్టర్ స్వాధీనం

నాగాయలంక: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న దేగలవారిపాలెం గ్రామానికి చెందిన అకుల వెంకటరాముపై కేసు నమోదు చేసి అవనిగడ్డ కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్.ఐ కలిదిండి రాజేష్ ఆదివారం తెలిపారు. మర్రిపాలెం వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ట్రాక్టర్ యజమాని, డ్రైవర్ రాము ఇసుక తరలిస్తూ సరైన ధ్రువీకరణ ప్రతాలు చూపలేదన్నారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి అవనిగడ్డ కోర్టులో హాజరు పర్చామని ఎస్ఐ చెప్పారు.

కోలాహలంగా విగ్రహాల నిమజ్జనోత్సవాలు



గూడూరులో ప్రత్యేక వాహనంపై నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు

గూడూరు: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని గూడూరులోని బండారు వారి వీధిలో ఏర్పాటు చేసిన గణనాథుడిని ఆదివారం కోలాహలంగా నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. మేళతాళాలు డీజేలతో పురవీధుల్లో గణనాథుడిని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. జాతీయ రహదారిపై రామరాజుపాలెం కాలువలో వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. అంతకుముందు శనివారం రాత్రి నిర్వహించిన స్వామివారి లడ్డూ వేలంలో గ్రామానికి చెందిన రాజేష్ అనే వ్యక్తి రూ.40,100కు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నాడు.

అన్న సమారాధనలు

మచిలీపట్నంటౌన్: వినాయక చవితి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గణనాథుడి విగ్రహాల నిమజ్జనాలు పూర్తయ్యాయి. దీంతో నగరంలోని పలు గణనాథుడి పందిళ్ల వద్ద అన్న సమారాధన కార్యక్రమాలు ఆదివారం పెద్ద ఎత్తున నిర్వహించారు. స్థానిక మూడు స్తంభాల సెంటర్‌లోని విజయ గణపతి ఆలయం వద్ద, రామానాయుడుపేట సెంటర్లోని శ్రీ సిద్ధి బుద్ధి వినాయకుని మందిరంలో ఏర్పాటు చేసిన పందిరి వద్ద అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. మంత్రి కొల్లు రవీంద్ర స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ లోగిశెట్టి వెంకట స్వామి, రాధారంగా మిత్రమండలి జిల్లా నాయకుడు వాడపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు. వేలాది మంది భక్తులు అన్న ప్రసాదాలను స్వీకరించారు. అన్న సమారాధన కార్యక్రమాలను ఆయా ఉత్సవ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.



కోడూరులో నిమజ్జనానికి తరలివెళ్తూ..

కోడూరు: మండలంలోని మందపాకల, వి.కొత్తపాలెం, మాచవరం గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. స్వామివార్లను ప్రత్యేక వాహనాలపై ఊరేగించారు. విగ్రహాల ముందు డప్పువాయిద్యాలు, మేళతాళాల, డీజే పాటలకు అనుగుణంగా యువత సందడి చేశారు. అనంతరం విగ్రహాలను సమీప కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

వరద బాధితులకు వంటపాత్రల పంపిణీ



అవనిగడ్డ: పులిగడ్డ పంచాయతీ పరిధిలోని పలు వరద బాధిత ప్రాంతాల్లో నియోజకవర్గానికి చెందిన ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల ఆధ్వర్యంలో సేకరించిన విరాళాలతో వరద బాధితులకు వంటపాత్రలు, కుక్కర్లను అందించారు. గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ (రాజా) చేతుల మీదుగా ఆదివారం పంపిణీ చేశారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, ఎంఈవోలు ఎన్ శివశంకరరావు, అన్నపరెడ్డి పిచ్చయ్య, టీపీఎం రాందాస్, డెమొక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జీవీఎస్ పెరుమాళ్లు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.సాంబశివరావు, సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గుడివాక శేషుబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

దేవుడిని అడ్డం పెట్టుకుని నీచ రాజకీయాలు

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

అవనిగడ్డ: కూటమి వందరోజుల పాలనా వైఫల్యంపై ప్రజల దృష్టిని మళ్లించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై విషప్రచారం చేస్తున్నారని అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు విమర్శించారు. అవనిగడ్డలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువుల ఆరాధ్యదైవంగా భావించే తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపారని చంద్రబాబు చేసిన విమర్శలు హిందువుల మనోభావాలు దెబ్బతీసేవిగా ఉన్నాయన్నారు. తిరుపతి లడ్డూ ప్రసాదానికి సరఫరా చేసే నెయ్యి విషయంలో తిరుపతిలోనే ముగ్గురు వ్యక్తులు తనిఖీలు చేస్తారని, చెప్పిన విధంగా క్వాలిటీ లేకపోయినా, కల్తీ చేసినా తిప్పి పంపించేస్తారన్నారు. నెయ్యిలో వెజిటబుల్ కొవ్వు ఉన్నట్టు ఒక ల్యాబ్‌లో వచ్చిన రిపోర్ట్‌ని పట్టుకుని ఈనాడులో ఏకంగా లడ్డూలో పందికొవ్వు అంటూ వార్తలు ఇచ్చారన్నారు.

కావాలనే మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై విషప్రచారం చేస్తున్నారని, ఆయన దిష్టిబొమ్మలు దగ్ధం చేయిస్తున్నారన్నారు. అధికారంలో ఉన్నది కూటమి ప్రభుత్వమే కదా తప్పు చేసినవారిని శిక్షించకుండా జగన్ దిష్టిబొమ్మలు తగులబెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ఒకసారి తిరుమలలో జరిగిన బాంబు దాడిలో వెంకటేశ్వరస్వామి దయవల్లనే బతికి బయటపడ్డారని, అయినా బుద్ధిరాని చంద్రబాబు దేవుని ప్రసాదంపై నీచరాజకీయాలు చేయడం మానుకోవాలన్నారు.

వారధి పనులు ప్రారంభించండి..

గత ప్రభుత్వం హయాంలో ఎదురుమొండి వారధి కోసం రూ.108 కోట్లు మంజూరయ్యాయని, ఎన్నికల ముందు టెండర్లు పిలవడం వల్ల కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదని సింహాద్రి రమేష్ బాబు చెప్పారు. ఎదురుమొండి వారధికి రూ.150 కోట్లతో టెండర్లు పిలవాలని ఎంపీ బాలశౌరి చెప్పారని, కాలయాపన చేయకుండా వంతెన నిర్మించి, మీ పేర్లే పెట్టుకోవచ్చని సూచించారు. తమకు పేరు ప్రఖ్యాతలు అవసరం లేదని, ప్రజల సమస్య పరిష్కారం అయితే చాలని పేర్కొన్నారు. వక్కపట్లవారిపాలెం నుంచి ఓఎన్‌జీసీ ప్లాంట్ వరకూ రూ.1.92 కోట్లతో నిర్మించనున్న రహదారికి మార్చిలోనే శంకుస్థాపన చేశామని, ఇప్పుడేదో దీనిని సాధించినట్టు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ రైతువిభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ (లచ్చి), వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, పార్టీ యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి గాజుల జయగోపాల్ పాల్గొన్నారు.

ఆర్ అండ్ బీ రహదారి ధ్వంసం



ట్రాక్టర్ వెనుక భాగంలో స్తంభాన్ని కట్టి రహదారిపై లాక్కుని వెళ్తున్న దృశ్యం

కోడూరు: విద్యుత్ అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రధాన రహదారులు ధ్వంసం అవుతున్నాయి. కోడూరు–అవనిగడ్డ ఆర్ అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా ఉండడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోడూరు నుంచి కృష్ణాపురం వరకు రహదారి కొంత మేర బాగుండగా, ఆ ప్రాంతంలో కూడా విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రహదారి ధ్వంసమవుతోంది. నూతన విద్యుత్ లైన్ నిర్మాణంలో భాగంగా విద్యుత్ అధికారులు స్తంభాలను ప్రత్యేక ట్రాలీలో తరలించాల్సి ఉంది. అయితే అధికారులు ఆ విధంగా చేయకుండా ట్రాక్టర్ వెనుక భాగంలో స్తంభాన్ని ఇనుప గొలుసులతో కట్టి రహదారిపై ఈడ్చుకుంటూ తీసుకెళుతున్నారు. దీంతో రహదారి ధ్వంసం అవుతోంది. రహదారుల ధ్వంసానికి కారణమైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. విద్యుత్ స్తంభాలు, తీగలు ధ్వంసం అయితే సంబంధిత వ్యక్తులపై విద్యుత్ శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసి పరిహారం వసూలు చేస్తారు. మరి ఆర్ అండ్‌బీ అధికారులు ఎందుకు మిన్నకుంటున్నారో అర్థం కావటం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

115 మందికి నేత్ర వైద్య పరీక్షలు



వృద్ధులకు నేత్ర పరీక్షలు చేస్తున్న కంటి డాక్టర్లు, పక్కన అతిథులు

నాగాయలంక: సుదర్శి మానవతా సేవాసంస్థ అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని పలువురు అభినందించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి (పెదకాకాని) సహకారంతో ఈ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 46వ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వీఆర్వో బీవీ లింగేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ ప్రారంభించారు. తలశిల శ్రీరాములు, ఉప్పల వెంకయ్య, కనిగంటి అంకినీడు /జ్ఞాపకార్థం వారి కుటుంబీకుల ఆర్థిక సౌజన్యంతో స్థానిక మారుతీ విద్యానికేతన్ డిజిటల్ స్కూలు ప్రాంగణంలో వైద్య శిబిరం నిర్వహించారు. 115 మందికి కంటి పరీక్షలు చేయగా, వారిలో 90 మంది వృద్ధులను ఐఓఎల్ ఆపరేషన్ (కంటి లోపల అద్దం అమరిక)లకు ఎంపిక చేసి ఉచిత శస్త్ర చికిత్సలకై బస్సులో శంకర కంటి ఆసుపత్రికి పంపించారు. డాక్టర్ సుకృత, డాక్టర్ చేతన లక్ష్మి నేత్ర పరీక్షలు జరిపారు. సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కనిగంటి వెంకట నారాయణ, ఆసుపత్రి క్యాంప్ ఇన్‌చార్జి గంగాధర్ పాల్గొన్నారు. తలశిల లీలామనోహర్, జమీల మస్తాన్, మత్తి శివ, రవి, షేక్ మస్తాన్ తదితరులు సేవలందించారు.

తడి, పొడిచెత్త నిర్వహణపై అవగాహన



పెడనలో ప్రదర్శన నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, నాయకులు, శానిటరీ కార్యదర్శులు

పెడన: తడి, పొడి చెత్తపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని 11, 12వ వార్డులలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీరంకి నరసింహారావు, శానిటరీ కార్యదర్శులు, మేస్త్రీలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

చోడవరం(నాగాయలంక): మండలంలోని చోడవరం పంచాయతీ పరిధిలో ఐతసీ కార్యక్రమం కింద తడిచెత్త, పొడిచెత్త నిర్వహణపై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల విస్తరణాధికారి కలపటపు అప్పలనరసమ్మ నేతృత్వంలో గ్రామస్తులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. నీటివృథా, సింగిల్‌యూజ్ ప్లాస్టిక్, ఆరోగ్యకర అలవాట్లు, జీవనశైలి తదితర అంశాలను వివరించారు. అనంతరం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ చేశారు. గ్రామ కార్యదర్శి విజయకృష్ణ, పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

పెడన: దాతలు ముందుకు వచ్చి పేదలకు ఉదారంగా సాయమందించాలని ఆల్ ఇండియా వీవర్స్ ఫేడరేషన్ జాతీయ అధ్యక్షుడు, పెడన మున్సిపల్ మాజీ చైర్మన్ బండారు ఆనంద ప్రసాద్ అన్నారు. ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ కృష్ణా జిల్లాశాఖ ఆధ్వర్యంలో దివంగత నున్న ఎలమందయ్య మోక్షనందనరావు జ్ఞాపకార్థం కుమారుడు రమేష్, కోడలు త్రివేణి దంపతుల సహకారంతో నిరుపేదలకు నిత్యావసర సరుకులను అందజేశారు. వీటిని స్థానిక శ్రీశ్యామలాంబ దేవి ఆలయంలో ఆదివారం ఆనందప్రసాద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పిచ్చుక ఫణికుమార్, ఆకురాతి జనార్ధనరావు, కట్ట హేమసుందరరావు, బళ్ల సాంబశివరావు, నున్న ప్రసాద్, పేరు శెట్టి నాగరవి తదితరులు పాల్గొన్నారు.